సాక్షి మంచిర్యాల

సోమవారం । 13 । జనవరి । 2025



ఆగుతూ.. అందాలు వీక్షిస్తూ..
కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం మూడో బర్డ్‌వాక్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అందమైన పక్షులను కెమెరాల్లో బంధించారు. 8లో▸



ఝురి దేవతకు ప్రత్యేక పూజలు
పవిత్ర గంగాజలం కోసం బయలుదేరిన మెస్రం వంశీయులు ఆదివారం వడగామ్ చేరుకున్నారు. ఝురి(కలశం) దేవత తమ గ్రామానికి చేరుకోవడంతో ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.5 /17.5
చాలావరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం మరింత తగ్గుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కవ్వాల్‌లో హైకోర్టు న్యాయమూర్తి..



మైసమ్మ కుంట వద్ద హైకోర్టు న్యాయమూర్తి

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్‌లో హైకోర్టు న్యాయమూర్తి రాధరాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సఫారీ వాహనంలో కామన్‌పల్లి వాచ్‌టవర్, మైసమ్మకుంట ప్రాంతాలలో పర్యటించారు. రేంజ్ అధికారి శ్రీనివాస్‌తోపాటుగా రేంజ్ కార్యాలయ సెక్షన్ అధికారి హన్మంతరావు, రవి, నహీద, బీట్ అధికారులు ముజీబొద్దీన్, పోచయ్య, రుబీనా ఇక్కడి వివరాలను తెలియజేశారు. అడవిలో వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న అభివృద్ధి, గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు తదితర అంశాల గురించి న్యాయమూర్తికి వివరించారు. రేంజ్ పరిధిలో బర్డ్‌వాచ్ చేసి పక్షులను అడవి అందాలు, వన్యప్రాణులను పరిశీలించి న్యాయమూర్తి ఆనందం వ్యక్తం చేశారు. న్యాయమూర్తి వెంట చెన్నూరు కోర్టు న్యాయమూర్తి రవి, సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ ఉన్నారు.

ఎస్టీపీపీకి ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకుంటోంది. ఇప్పటికే వరుసగా మూడు అవార్డులు అందుకోగా, రక్షణ విభాగంలో మరో అవార్డును కైవసం చేసుకుంది. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు సేఫ్టీ ఎక్సలెన్స్–పవర్ థర్మల్ సెక్టర్ విభాగంలో 1వ గ్రీన్ ఎన్విరో సేఫ్టీ అవార్డు అందుకుంది. ఢిల్లీలో శనివారం జరిగిన అవార్డు ప్రదానోత్సంలో ఎస్టీపీపీ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంతులా, రక్షణాధికారి పులి సురేశ్ అవార్డు అందుకున్నారు. ఇప్పటికే అత్యల్ప నీటి వినియోగంలో బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ఉపయోగించి శుద్ధి చేయడం ద్వారా బెస్ట్ జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్లాంటు అవార్డులను వరుసగా అందుకోగా, రక్షణ విభాగంలో మరో అవార్డు అందుకోవడంపై ఎస్టీపీపీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు సైకిల్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు గుడిపేట బుగ్గగట్టు హనుమాన్ విగ్రహం ఎదుట ఉన్న మైదానంలో ప్రారంభమయ్యే సైకిల్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థులకు 4 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మొదటి విజేతకు రూ.3 వేలు, రెండో విజేతకు రూ.1,500, పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలు ఉంటాయని వివరించారు.

బీసీ బంధు యూనిట్లు ఎక్కడ?

- చెక్కులు ఇచ్చినా అందని వివరాలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

కాసిపేట: గత ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీబంధు పథకం ప్రకటించి హడావుడిగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున చెక్కులు అందించింది. తిరిగి చెల్లించే అవసరం లేకపోవడంతో పోటీపడి కొందరు, కమీషన్ అందించి కొందరు పథకాన్ని దక్కించుకున్నారు. అయితే చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు ఎవరు కూడా యూనిట్‌లు ఏర్పాటు చేయలేదు. కొందరికి పాత షాపులు ఉన్నప్పటికీ వారి వివరాలు అందించక పోవడంతో చెక్కులు జారీ అయినా వివరాలు లేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అప్పటి ఎమ్మెల్యేలు అనుచరులకు, కార్యకర్తలకు మంజూరు చేయించగా చాలా వరకు కమీషన్ల పర్వం కొనసాగిందనే విమర్శలున్నాయి. యూనిట్‌కు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కమీషన్ తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 950 మందికి బీసీ బంధు కింద రూ.లక్ష చొప్పున అందించారు. వీటి విలువ మొత్తం రూ.9.50 కోట్లు. ఉన్నతాధికారులు బీసీబంధు లబ్ధిదారుల ఫొటోలు యూనిట్‌తో సహా పెట్టాలని ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు ఎవరూ స్పందించడం లేదు. వివరాలు అందించకుంటే రికవరీకి ఆదేశాలు జారీ చేస్తామని అధికారులు బెదిరించినా స్పందన లేదు. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అర్హులకు కాకుండా నేతలకు ఇవ్వడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సంక్రాంతికి వస్తున్నాం..

- ఊరిబాట పట్టిన జనం
- దారులన్నీ అటువైపే
- పల్లెలకు పండుగ శోభ..



సంక్రాంతికొస్తున్నాం. సిన్మాకాదు రియాలిటీ. సంక్రాంతి అంటేనే సందడి. సొంతూరికెళ్తేనే పెద్ద పండుగ మజా. అందుకే చలోచలో అంటూ సొంతూళ్లకు పయనమయ్యారు. సంక్రాంతికి సొంతూళ్ల బాట పట్టిన జనం.. రెండు రోజులుగా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో పల్లెలకు సంక్రాంతి శోభ వచ్చింది. బంధుమిత్రులతో సంక్రాంతిని ఎంజాయ్ చేసేందుకు కుటుంబాలతో చేరుకుంటున్నారు. కష్టమైనా.. ఖర్చులైనా సంక్రాంతికి సొంతూళ్లో ఉంటే ఆ ఆనందమే వేరు. అందుకే సంక్రాంతికొస్తున్నాం అంటూ పిల్లాపాపలతో సొంతూళ్లకు బయలుదేరారు. సంక్రాంతి అంటే సందడి. భోగి మంటలు, గాలిపటాలు, కోళ్లపందేలు, గంగిరెద్దులు, రంగురంగుల ముగ్గులు. ఒకరోజు కాదు సంక్రాంతి వచ్చిందంటే ఊళ్లో ఉన్నన్నాళ్లూ ప్రతిరోజూ సంబరమే. ఇప్పటికే వేడుకలకు అంతా సిద్ధమయ్యారు. – సాక్షి నెట్‌వర్క్

అంతా ఒకచోటికి..

తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాల్లో.. సంక్రాంతిది విశిష్ట స్థానం. అందరినీ ఒక్కటి చేసే అతి పెద్ద సంబరం. ఎక్కడెక్కడో ఉన్నోళ్లందరినీ ఊళ్లకు తీసుకెళ్లి మూలాల్ని గుర్తుచేసే మహా ఉత్సవం. ఉద్యోగవ్యాపారాల్లో తలమునకలై ఉన్నా, ఎక్కడో సుదూరాన ఉన్నా సంక్రాంతి వచ్చిందంటే అంతా ఓచోటికి చేరతారు. సొంత ఊళ్లో సంబరాల్లో మునిగి తేలతారు. పిల్లాపాపల రాకతో పెద్దలు కూడా పిల్లలైపోతారు. కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాల స్ఫూర్తిని మూడు నాలుగు రోజులపాటు మళ్లీ ఆవిష్కరించే అతి గొప్ప పండుగ సంక్రాంతి. భోగి, సంక్రాంతి, కనుమ.. మూడు రోజుల ముచ్చటైన వైభోగం పల్లె లోగిళ్లలోనే కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్రాంతి భావోద్వేగ పండుగ. మళ్లీ ఏడాదిదాకా ఆ జ్ఞాపకాలను పదిలంగా దాచుకునేలా చేసే పండుగ. ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు పరుచుకుంటాయి. డూడూ బసవన్నల సవ్వళ్లు, హరిదాసుల కీర్తనలు వినిపిస్తాయి. సోమవారం నుంచి మూడు రోజులపాటు జరుపుకునే పండుగ కోసం జిల్లాలోని సొంత ఊళ్లకు వచ్చినవారి అభిప్రాయాలు వారి మాటల్లో..

పండక్కి వచ్చి.. సందడి చేశారు..



క్రికెట్ టోర్నమెంట్‌లో ఉద్యోగులు, గ్రామస్తులు..

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్, బెంగళూర్ వంటి సుదూర ప్రాంతాల్లో ఉంటున్నారు. సంక్రాంతి పండక్కి మాత్రం సొంతూరికి వస్తుంటారు. వచ్చిన వాళ్లంతా ఇళ్లకే పరిమితం కాకుండా గ్రామస్తులతో కలిసి, ఆడిపాడేందుకు, గత రెండేళ్లుగా ఏదో ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈసారీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు కార్యక్రమ నిర్వాహకుడు రవిరాజ్ తెలిపాడు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసేవారంత, పల్లెకు వచ్చి, సొంత గ్రామంలో ఆడుతూ, పాడుతూ, గ్రౌండ్‌లో సందడి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు క్రికెట్ పోటీలు తిలకించారు. దీంతో సంక్రాంతి సందడి కనిపించింది.

పండుగొస్తే సొంతూరికి..



దండేపల్లి: నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. సంక్రాంతి పండుగొస్తే అందరూ సొంతూళ్లకు వస్తుంటారు. అలానే నేను కూడా ప్రతీ సంక్రాంతికి ఊరికి వస్తాను. తల్లిదండ్రులతో కలిసి పండుగ జరుపుకుంట. వేడుకలు సొంతగ్రామంలో ఇంటి వద్ద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి చేసుకుంటేనే ఆనందంగా ఉంటుంది.
– తల్లిదండ్రులతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీనివాస్, దండేపల్లి మండలం చింతపల్లి

సొంతూరిలోనే సంక్రాంతి..



చెన్నూర్: సొంతూరు కన్న తల్లితో సమానం. మేము ఇద్దరు అన్నదమ్ములం. పిల్లాపాపలతో 25 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాం. మాది ఉమ్మడి కుటుంబం. ఏటా సంక్రాంతికి అన్న, వదిన, అమ్మ, అక్కలతోపాటు పిల్లలతో కలిసి చెన్నూర్‌కు వచ్చి సంక్రాంతి పండగను జరుపుకుంటాం. ఈసారి కూడా పండుగ కోసం చెన్నూరుకు వచ్చాం.
– పులి కిశోర్‌కుమార్, బ్రాహ్మణవాడ, చెన్నూర్ పట్టణం



పిండి వంటలు చేస్తున్న మహిళలు

పండక్కి అమ్మమ్మ ఇంటికి..

లక్సెట్టిపేట: సంక్రాంతి పండుగను ప్రతి సంవత్సరం అమ్మమ్మ వారి ఇంటికి వచ్చి ఘనంగా జరుపుకుంటాం. ఐర్లాండులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మా కూతురు శ్రీతిక, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న శుక్రుత, హన్విత కూడా పండుగకు అమ్మమ్మ ఇంటికి వస్తారు. సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకుంటారు. సంప్రదాయ పద్ధతితో పండుగను మూడు రోజులు జరుపుకుంటారు.



పోతపల్లికి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ఐర్లాండ్ నుంచి వచ్చాను..



నా పేరు బద్దం శ్రీతిక, అమ్మనాన్నలతో హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాము. ఐర్లాండులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. సంక్రాంతి పండుగ కోసం ఐర్లాండ్ నుంచి అమ్మమ్మ ఇంటికి వచ్చాను. సంక్రాంతి పండుగ అంటే చాలా ఇష్టం. పల్లెటూరు అమ్మమ్మ వారి ఊరిలో కుటుంభ సభ్యుల అందరితో కలిసి పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంటుంది.

భోగభాగ్యాల పండుగ

- ముంగిళ్లలో హరివిల్లులు..
- ఆకాశవీధుల్లో పతంగులు..
- నేటి నుంచి సంక్రాంతి సంబురాలు

మంచిర్యాలఅర్బన్: ఊరు వాడలా సంక్రాంతి శోభ నెలకొంది. సంస్కృతి, జానపద కళల ప్రాముఖ్యత ఉన్న సంక్రాంతి భోగభాగ్యాలు, సిరిసంపదలు ఇచ్చే పండుగగా ప్రసిద్ధి. మూడు రోజులపాటు సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. వివిధ ప్రాంతాల్లోని విద్యార్థులు, వ్యాపారం, ఉద్యోగరీత్యా స్థిరపడిన వారందరూ స్వగ్రామాలకు చేరుకున్నారు. స్వాగతం పలికే రంగవల్లులు, చలికి దీటుగా ఎగిసిపడే భోగిమంటలు, డూడూ బసవన్నల కోలాహలం, భోగిపండ్ల ఉత్సవం, గాలిపటాల సందడి నెలకొంది. ఈనెల 13 నుంచి 15 వరకు భోగి, సంక్రాంతి, కనుమ జరుపుకోనున్నారు.

మూడు రోజులు..
భోగి: మూడు రోజుల పండుగలో మొదటి రోజు భోగి పండుగ.. భోగి రోజున ఇంద్ర దేవుడు, వరుణదేవుడిని పూజిస్తారు. వర్షాలు వచ్చి పంటలు బాగా పండాలని కోరుకుంటారు. ఈపండుగను రైతులు ప్రత్యేకంగా జరుపుకుంటారు. సంకుచిత భావాలకు స్వస్తి పలికి నూతనత్వానికి నాంది పలకాలనే ఆశయంతో పాత వస్తువులను, పిడకలు వేసి భోగి మంటలను వేస్తారు. పిల్లల నుంచి పెద్దలు గుమిగూడి భోగి మంటలు వేస్తారు. స్నానాలు ఆచరించిన తర్వాత నూతన వస్త్రాలు ధరించి పండుగ జరుపుకుంటారు. చిన్న పిల్లలకు భోగి పండ్లు పోస్తారు.



భోగి వేడుకల్లో వాకర్స్‌క్లబ్ సభ్యులు (ఫైల్)

సంక్రాంతి..
సూర్యుడు ధనుస్సు రాశినుంచి మకరరాశిలోకి సంక్రమించే రోజు సంక్రాంతి . మానవలోకానికి వెలుగులు నింపటానికి లోకబాంధవుడైనా సూర్యున్ని ఆహ్వానించే సుదినం. కూష్మాండ, సువరణ, వస్త్ర దానాలు చేస్తారు. మధ్యాహ్నం నుంచి షడ్రుచులతో కూడిన విందు భోజనాలు, నూతన వస్త్రధారణతో ప్రధాన పండుగను నిర్వహిస్తారు.

కనుమ..
తిండి గింజలను అందించటంలో ప్రధాన పాత్ర పోషించే పశువులను దేవతా స్వరూపంగా కనుమ పండుగనాడు వాటికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఎడ్లను శుభ్రంగా కడిగి, పసుపు కుంకుమలతో అలంకరించి హారతులిస్తారు.

పిండివంటలకు ప్రాధాన్యత..
సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రతీ ఇంటి పిండి వంటలు తయారీకి ప్రాధాన్యమిస్తున్నారు. సకినాలు, గారెలు, కరకరలాడే కారపూసలు, తియ్య తియ్యని అరిసెలు ఎన్నో ప్రాధాన్యతిస్తారు.

నేలపై రంగవల్లులు.. నింగిలో పతంగులు..
సంక్రాంతి పండుగలో మహిళలు రంగవల్లులు, పెద్దలకు ఆటలపోటీలు ఒక ఎత్తయితే. చిన్నారులకు గాలిపటాలతో దోస్తీ ఎక్కువ. సంప్రదాయమైన గాలిపటాలు ఎగురవేయడం ఆవాయితీగా వస్తోంది. ముంగిళ్లలో ముగ్గులు మెరిస్తే.. నింగిలో గాలిపటాల సందడి కనిపిస్తుంది.

వాసవీ విజయం టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..
సంక్రాంతి సందర్భంగా రాళ్లపేట్ రోడ్–1లో ఆదివారం వాసవీ విజయం టీచర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పతంగులను ఆవిష్కరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాసం మల్లికార్జున్, కార్యదర్శి సురేశ్, రీజినల్ సెక్రటరీ వంశీకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో ముగ్గుల పోటీలు..



పాఠశాలలో సంక్రాంతి వేడుకలు..



పతంగులు ఆవిష్కరిస్తున్న వాసవీ విజయం క్లబ్ ప్రతినిధులు

వివేకానంద మార్గాన్ని ఆచరించాలి



సేవలు అందించి జ్ఞాపికలు అందుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కీర్తి రాజవీర్

మంచిర్యాలటౌన్: స్వామి వివేకానంద సన్మార్గాన్ని అందరూ ఆచరించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలవాలని జిల్లా యుజవన క్రీడల అధికారి కీర్తిరాజవీర్ అన్నారు. కలెక్టరేట్‌లో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొదటగా మంచిర్యాల కాలేజీరోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా క్రీడాలశాఖ అధికారి మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన భారత పౌరుడు స్వామి వివేకానంద అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తిగా యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
అనంతరం జాతీయ యువజన అవార్డు గ్రహీత టి.సత్తయ్య, మార్వాడి యువమంచ్, యువతరం, రక్తదాన స్వచ్ఛంద సంస్థలు, సమాజంలో ఉత్తమ సేవలను అందించిన వారికి, యువజన సంఘాల ప్రతినిధులకు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డెమో బుక్క వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన పీఆర్‌సీ కోసం కృషి

- పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులుగం దామోదర్‌రెడ్డి



మాట్లాడుతున్న పీ దామోదర్‌రెడ్డి

నస్పూర్: ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్‌సీ కోసం కృషి చేస్తున్నామని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులుగం దామోదర్‌రెడ్డి తెలిపారు. సీసీసీలోని ఎంఎం గార్డెన్‌లో యూనియన్ మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డితో కలిసి ఆయన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఘం బలపర్చిన అభ్యర్థులు వంగ మహేందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన హయాంలో మహిళా టీచర్లకు అదనంగా 5 సీఎల్స్, మెటర్నటీ లీవులు మంజూరు చేయించామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు ..
ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బచ్చ మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం మహేశ్, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడిగా బిల్లా తిరుపతయ్య, మీడియా ఇన్‌చార్జిగా కె.తిరుపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీగా పోటీ చేసిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొండు జనార్దన్, జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు శాంకరి, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తిరుపతి



బిల్లా తిరుపతి

కోటపల్లి: కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బిల్లా తిరుపతి పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో ఆదివా రం మంచిర్యాల కార్యనిర్వాహక సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బిల్లా తిరుపతి మాట్లాడుతూ సంఘం పటిష్టతకు కృషి చేస్తానని, పదవి మరింత బాధ్యత పెంచిందన్నారు.

నేతకానీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- టీఎన్‌ఎంవీఎస్ అధ్యక్షుడు ప్రసాద్‌నేత



మాట్లాడుతున్న ప్రసాద్‌నేత

జన్నారం: ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్‌నేత డిమాండ్ చేశారు. జన్నారంలోని ఎస్‌పీఎస్ కన్వెన్షన్ సెంటర్లో నేతకాని కులసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అనేది కేవలం రెండు సోదర కులాలకు సంబంధించిన అంశంగా పరిగణించకుండా 59 కులాల అభిప్రాయాన్ని, నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతకానీలను ప్రత్యేక గ్రూపుగా గుర్తించి, కేటగిరీ ఈ లో చేర్చి 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలో జన్నారంలో నేతకానీల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, పట్టణ అధ్యక్షుడు దుర్గం వసంత్, విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్, జిల్లా ప్రధా న కార్యదర్శి అల్లూరి వినోద్, నాయకులు హాజరయ్యారు.

చెస్‌తో మేధాశక్తి పెంపు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

మందమర్రిరూరల్: వివేకానంద జయంతి సందర్భంగా మందమర్రి పట్టణంలోని పాలచెట్టు సమీపంలోని శ్రీపంచముఖి హనుమాన్ టెంపుల్ ఆవరణలో టీం పంచముఖి వెల్ఫేర్ సొసైటీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చదరంగం గేమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం దేవేందర్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. అంతకుముందు వివేకానందస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెస్‌తో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నగదుతోపాటు బహుమతులు ప్రదానం చేశారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రహమాన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ ఈగ కనుకయ్య, టీం పంచముఖి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడు మృతి


కరుణ్ (ఫైల్)

ముథోల్: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కోలిగల్లీకి చెందిన కరుణ్ (32) తండ్రి రాందాస్ భైంసా సర్కిల్ పరిధిలోని కుంటాల మండల కేంద్రంలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి రాందాస్ ముథోల్‌కు రాగా ఆస్తి విషయంలో తండ్రీకొడుకుల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో తండ్రి కొట్టడంతోనే మృతి చెందినట్లు మృతుని భార్య సుష్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ సందర్శించి తనిఖీ నిర్వహించారు.

చోరీకి యత్నించిన ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: చోరీకి యత్నించిన కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో గల ఎస్‌బీఐకి సంబంధించిన పాత సామగ్రి ఓ షెడ్‌లో భద్రపర్చి ఉంచగా ఆదివారం ఉదయం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆ షెడ్ తాళం పగులగొట్టి సామగ్రి దొంగిలించేందుకు యత్నించారు. కలెక్టరేట్‌లో పనిచేసే సబార్డినేటర్ నర్సిములు గమనించి ట్రెజరీలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు వెళ్లగా నిందితులు పరారయ్యారు. టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరైన సారాల సాయన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చైనా మాంజా విక్రయించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నిషేధిత చైనా మాంజా విక్రయించిన ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని బడ్కమొహల్లాకు చెందిన వడస్కర్ కృష్ణ, అశోక్‌రోడ్‌కు చెందిన కూరగాయల శ్రీనివాస్ అశోక్ రోడ్ ప్రాంతంలో పతంగుల కోసం చైనా మాంజా విక్రయించినట్లు తెలిపారు.

చైనామాంజా స్వాధీనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చింత పందువాడకు చెందిన చూడవరపు రమాకాంత్ ఇంట్లో నిలువ ఉంచిన చైనామాంజా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు రమాకాంత్ ఇంట్లో ఆదివారం తనిఖీ నిర్వహించగా ఆరు చైనామాంజా బాబిన్‌లు లభించాయని వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

కోటపల్లి(చెన్నూర్): కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని నాగంపేట బొప్పారం అటవీ ప్రాంతంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్దనుంచి 10 పందెం కోళ్లు, 7 ఫోన్లతో పాటు రూ.59,780 నగదును స్వాధీనం చేసుకుని నాలుగు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆగుతూ... అందాలు వీక్షిస్తూ


సర్పెంట్ ఈగల్


ఉలీ నెకడ్ స్పార్క్


కుటుంబ సభ్యులతో కలిసి బర్డ్‌వాక్‌లో పాల్గొన్న హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్లు


లేజర్ విస్లింగ్ డక్

• కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఉత్సాహంగా సాగిన బర్డ్‌వాక్ • హాజరైన ప్రకృతి ప్రేమికులు

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన మూడవ బర్డ్‌వాక్ కార్యక్రమం ఆగుతూ.. సాగుతూ ఉత్సాహంగా సాగింది. జన్నారం ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వరంగల్, హైదరాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల నుంచి 15 మంది హాజరయ్యారు. బైసన్‌కుంటలో ఏర్పాటు చేసిన గుడారాల్లో శనివారం రాత్రి బస చేశారు. క్యాంప్‌ఫైర్‌తో పాటు నేచర్ ఎంజాయ్ చేశారు. ఉదయం బైసన్‌కుంట, నీలుగాయికుంట, మల్యాల వాచ్‌టవర్ ప్రాంతాల్లో పర్యటించి కెమెరాలు, బైనాక్యులర్ ద్వారా పక్షులను కెమెరాల్లో బంధించారు. అడవుల అందాలను వీక్షించారు. సఫారీ ప్రయాణంలో కనిపించిన చుక్కల దుప్పులు, అడవి దున్నలు, నీలుగాయిలను చూసి మురిసిపోయారు. ఈ సందర్భంగా వారిని పలకరించిన 'సాక్షి'తో తమ అనుభవాలు పంచుకున్నారు.

– జన్నారం(ఖానాపూర్)

చాలా బాగుంది



మొదటిసారి ఇక్కడికి వచ్చా. అడవులు చాలా బాగున్నాయి. రాత్రి అడవిలో బస చేయడం కొత్త అనుభూతినిచ్చింది. ఉదయాన్నే పక్షులను పరిశీలించాం. చుట్టూ అడవి, మధ్యలో చెరువు, పక్షులు, ప్రకృతి అందం చాలా బాగుంది.

– విజయలక్ష్మి, హైదరాబాద్

పిల్లలతో కలిసివచ్చా



నేచర్ అంటే చాలా ఇష్టం. మన పరిసర ప్రాంతాల్లో ఇంత మంచి ప్రకృతి అందాలు ఉండటం చాలా అదృష్టం. మా పిల్లలతో కలిసి వచ్చా. చాలా ఎంజాయ చేశారు. 30 రకాల పక్షులను పరిశీలించా. ఇప్పటికి మూడు సార్లు బర్డ్‌వాక్‌కు హాజరయ్యా.

– అజయ్, సాఫ్ట్‌వేర్, నిర్మల్

కొత్త అనుభూతి



సంక్రాంతి సెలవులకు కుటుంబ సభ్యులతో కలిసి బర్డ్‌వాక్‌కు వచ్చాం. ఈ ప్రాంతంలో నేచర్ చాలా బాగుంది. ప్రకృతిలో పర్యటన కొత్తగా ఉంది. స్వచ్ఛమైన వాతావరణంలో వన్యప్రాణులు, పక్షులను పరిశీలించడం కొత్త అనుభూతినిచ్చింది.

– రవికుమార్, ఏజీపీ హైకోర్టు, హైదరాబాద్

ఎంజాయ్ చేశాం



నేను మా నాన్నతో కలిసి ఇక్కడికి వచ్చా. నాన్న ఇదివరకు ఇక్కడికి వచ్చినట్లు చెప్పడంతో నేనుకూడా రావాలని వచ్చా. రాత్రి ఫైర్‌క్యాంపు, డేరాలలో ఉండటం కొత్తగా అనిపించింది. రాత్రి పక్షులు, జంతువుల అరుపులు విని భయమేసింది. ఉదయం ఎంజాయ్ చేశాం. – నవీన్, విద్యార్థి

అడవుల విశిష్టతను తెలిపేందుకే..



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవుల్లో చాలా విశేషాలున్నాయి. ఇక్కడి అడవులకు విశిష్టత ఉంది. వీటిని పక్షి, ప్రకృతి ప్రేమికులకు తెలియజేయడానికి బర్డ్‌వాక్ నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేచర్ లవర్స్ నుంచి స్పందన వస్తోంది. వారికి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– సుష్మారావు, రేంజ్ అధికారి

గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద..


భీమారంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద

భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన బర్డ్‌వాక్‌లో పలువురు పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. గతంలో అటవీశాఖ అధికారులు నిర్వహించగా ఈసారి మాత్రం భీమారం, చెన్నూర్ ప్రాంతాలకు చెందిన పక్షి ప్రేమికులు కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్రాంతి సందర్భంగా తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. బైనాక్యులర్ ద్వారా వివిధ రకాల పక్షులను తిలకించినట్లు తెలిపారు.

ఉద్యోగికి సీఎండీ అభినందన


ప్రదీప్‌రావును అభినందిస్తున్న సీఎండీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనికి చెందిన ఎరవెల్లి ప్రదీప్‌రావును సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అభినందించారు. సింగరేణి సాధిస్తున్న ప్రగతిని వివరిస్తూ ప్రదీప్‌రావు రాసిన ఆర్టికల్ రాష్ట్ర ప్రభుత్వ అధికార మాస పత్రిక 'తెలంగాణ'లో ప్రచురితమైంది. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ అభినందించారు. సంస్థపై యూట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్‌లో మంచి పోస్టులు పెడుతూ సంస్థ గొప్పతనాన్ని తెలంగాణ వ్యాప్తం చేయడంపై సీఎండీ హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

తాండూర్(బెల్లంపల్లి): గంజాయి కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రేచిని గ్రామానికి చెందిన కొంతమంది శనివారం ఈజ్‌గాంలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి పంచుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించి సునార్కార్ రమణ, మచ్చ రాకేష్, కొడిపే నాగార్జున, చింతపురి శ్రీనివాస్ వద్ద 1,150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ప్రకృతిని విధ్వంసం చేసే ఓసీపీలు వద్దు'


మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

బెల్లంపల్లి: మానవ జీవన విధానాన్ని, ప్రకృతిని విధ్వంసం చేసే ఓసీపీల ప్రతిపాదనలు విరమించుకుని భూగర్భ గనుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లాభాల కోసం సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఓసీపీల వల్ల ప్రకృతి విధ్వంసం జరుగుతోందని, మానవాళితో పాటు జీవరాశుల మనుగడకు ప్రమాదం ఉందన్నారు. బెల్లంపల్లి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు అపారంగా ఉన్నాయని, వీటిని వెలికితీసేందుకు శ్రావణ్‌పల్లి, శాంతిఖని ఓపెన్‌కాస్ట్ గనులను ప్రారంభించాలనే తలంపుతో సింగరేణి యాజమాన్యం పావులు కదుపుతోందన్నారు. గతంలో ప్రతిపాదించిన షాఫ్ట్‌బ్లాక్ 1,2,3,4 భూగర్భ గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శాంతిఖని గని కేంద్రంగా కొత్తగా ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ గనిని బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొయ్యల ఏమాజీ, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరటి రాజన్న, కార్మిక సంఘాల నాయకులు చాంద్‌పాషా, మణిరాంసింగ్, గోగర్ల శంకర్, రాజు, రామస్వామి, దామెర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఝరి దేవతకు ప్రత్యేక పూజలు


ఝరి (కలశం) దేవతకు పూజలు చేస్తున్న వడగామ్ గ్రామస్తులు


విశ్రాంతి తీసుకుంటున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): కేస్లాపూర్ నాగోబా మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం ఈ నెల 10న బయలుదేరిన మెస్రం వంశీయులు ఆదివారం వడగామ్ చేరుకున్నారు. ఝరి(కలశం) దేవత తమ గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మెస్రం వంశీయులు అక్కడి నుంచి పాదయాత్రగా బయలుదేరి ఉట్నూర్ మండలంలోని సాలేవాడకు చేరుకున్నారు. ఈ నెల 13న ధర్మగూడ, 14న కొత్తగూడ, 15న కడెం మండలంలోని ఉడుంపూర్, 16న దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్, 17న మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగుకు వెళ్లి ప్రత్యేక పూజల మధ్య పవిత్ర గంగాజలం సేకరిస్తారు. తిరుగుప్రయాణంలో 18న ఉట్నూర్‌లో, 19న ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్‌లో బస చేస్తారు. 20న ఇంద్రవెల్లి మండలంలోని దొడంద పొలిమేరలో గంగాజలం భద్రపరిచి తమ గ్రామాలకు వెళ్లనున్నారు. ఈ నెల 24న మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మూడు రోజుల పాటు కెస్లాపూర్ పొలిమేరలోని మర్రిచెట్టు వద్ద సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. 28న గంగాజలంతో నాగోబాకు జలాభిషేకం చేసి ఆలయాన్ని శుద్ధిచేస్తారు. అనంతరం మహాపూజ నిర్వహించి నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు మెస్రం వంశీయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను పటేల్, మెస్రం లక్ష్మణ్, మెస్రం దేవ్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, దాదారావ్, తిరుపి, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

అర్ధశతాబ్దం తర్వాత అపూర్వ కలయిక


చెన్నూర్: 1975-76లో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

చెన్నూర్: 1975–76 విద్యాసంవత్సరంలో చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు చెన్నూర్‌తో పాటు మంచిర్యాల, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, బెంగళూర్, బెల్లంపల్లి, నిజామాబాద్, తదితర పట్టణాల్లో స్థిరపడ్డారు. వారంతా 50 ఏళ్ల తర్వాత ఆదివారం చెన్నూర్‌లోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులు పులి రామన్న, అడువాల లచ్చయ్య, బి.చంద్రయ్య, సాధిక్ అలీని ఘనంగా సన్మానించారు.

20 ఏళ్ల తర్వాత మళ్లీ బడిలో..

దండేపల్లి: దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05 లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మురిసిపోయారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు.


దండేపల్లి: నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

భీమిని(బెల్లంపల్లి): పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గంగారాం తెలిపిన వివరాల మేరకు కన్నెపల్లి మండలంలోని చింతపూడి గ్రామానికి చెందిన తుమ్మిడి గణేశ్ (24) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు చెప్పిన మాట వినకుండా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఆదివారం పొలానికి నీళ్లుపెట్టిరమ్మని తల్లిదండ్రులు చెప్పడంతో అక్కడికి వెళ్లిన గణేశ్ మద్యం మత్తులో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి తుమ్మిడి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖాళీగా తిరగొద్దన్నందుకు చంపేశాడు..

• కొత్తూరుపల్లిలో ఘటన


కౌసల్య (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జన్నారం: ఖాళీగా తిరగవద్దని, ఏదైనా పనిచేసుకోమని చెప్పినందుకు క్షణికావేశంలో చిన్నమ్మను హత్యచేసిన ఘటన మండలంలోని కొత్తూరుపల్లిలో చోటు చేసుకుంది. లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరుపల్లికి చెందిన మడావి కౌసల్య (50), జంగుబాయి అక్కాచెల్లెళ్లు. కౌసల్యకు పెళ్లయిన కొన్నాళ్లకే భర్త గౌరయ్యతో విడాకులయ్యాయి. జంగుబాయికి కృష్ణ, మోహన్‌రావు ఇద్దరు కుమారులు. మోహన్‌రావును కౌసల్య దత్తత తీసుకుంది. కృష్ణ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మానసిక స్థితి కుదుట పడటంతో ఖాళీగా ఉండకుండా ఏదైనా పనిచేసుకుంటే ఏమవుతుందని కౌసల్య పలుమార్లు చెప్పింది. అదే మనస్సులో పెట్టుకున్న కృష్ణ చిన్నమ్మను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం ఉదయం కౌసల్య గ్రామ సమీపంలోని వాగు పక్కన గల తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన కృష్ణ తన వద్ద ఉన్న గొడ్డలితో కౌసల్య మెడపై నరికాడు. మృతి చెందడంతో అక్కడి నుంచి పారిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి కుమారుడు మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు


ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మందమర్రిరూరల్ (రామకృష్ణాపూర్): తెలంగాణ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అండర్–13 ఉమెన్ రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో గజ్వేల్ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు విజయం సాధించింది. రెండోమ్యాచ్ హైదరాబాద్ ఉమెన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఖమ్మం), కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్ల మధ్య జరుగగా 02–02తో డ్రాగా ముగిసింది. మూడోమ్యాచ్ ట్విన్ సిటీస్ (హైదరాబాద్) పీకేఆర్–11(ఆదిలాబాద్) మధ్య జరుగగా ట్విన్ సిటీస్ జట్టుపై పీకేఆర్ 11 జట్టు 0–06తో గెలుపొందింది. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ రాంచందర్, ఏరియా ఆస్పత్రి వైద్యులు జానపాటి శరత్‌బాబు బహుమతులు అందజేశారు.

అడవిలో అద్దం



జన్నారం: అడవిలో ప్రకృతి ప్రసాదాలైన చెట్లు, మొక్కలు, జంతువులు వేటిని చూసినా అందంగా కనిపిస్తాయి. మంచిర్యాల జిల్లా కవ్వాల్ అభయారణ్యంలో వన్యప్రాణుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటికుంటలు అద్దాన్ని తలపిస్తున్నాయి. సమీపంలోని వృక్షాల ప్రతిబింబాలు.. అందంగా కనిపిస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి.


చెరువులో మోడువారిన చెట్ల ప్రతిబింబం